# కార్యకర్తలు అధైర్యపడొద్దు..



కాంగ్రెసోళ్ల దాడిలో పార్టీ కార్యకర్తకు తగిన గాయాలను చూస్తున్న మాజీ ఎమ్మెల్యే షకీల్

- ప్రతి ఒక్కరికి అండగా ఉంటా..
- కాంగ్రెస్‌సోళ్లు గెలిచిన మర్నాడే బోధన్‌లో చిల్లరగా ప్రవర్తించారు..
- ఆరు గ్యారంటీలను అమలు చేయాల్సిందే.. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తాం..
- రెండు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుంది.. మళ్లీ కేసీఆరే మన సీఎం
- బీఆర్‌ఎస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో మాజీ ఎమ్మెల్యే షకీల్

బోధన్, డిసెంబర్ 5: 'బోధన్ నియోజకవర్గంలో ఓడిపోయినందుకు కార్యకర్తలు అధైర్య పడవద్దని.. అండగా ఉంటామని.. ప్రతీ నిమిషం మీ వెంటే ఉంటా.. లక్ష ఏనుగుల బలం మీకు ఇస్తా..' అని మాజీ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ పార్టీ కార్యకర్తలకు భరోసా ఇచ్చారు. ఈ ఎన్నికల్లో పార్టీ నాయకుల, కార్యకర్తలు కష్టపడి పనిచేశారని ఆయన అభినందించారు. బోధన్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా షకీల్ మాట్లాడుతూ తన ఓటమికి నాయకులు, కార్యకర్తలు కారణం ఎంతమాత్రం కాదని.. ఫలానా గ్రామం, వార్డులో మెజార్టీ రాలేదంటూ సంబంధిత నాయకులపై నిందలు మోపవద్దన్నారు. రాష్ట్రంలో ప్రజలు మార్పును కోరుకున్నారన్నారు. కొత్త ప్రభుత్వం మంచి పనులు చేస్తే తాము సహకరిస్తామని, అయితే వారు తమ హామీలను నెరవేర్చకపోతే పోరాటాలు చేస్తామన్నారు. తెలంగాణ ఉద్యమం నడిపిన తమకు అధికారం ప్రధానం కాదని, అవసరమైతే తెలంగాణ కోసం మరొక ఉద్యమం నడుపుతామని స్పష్టం చేశారు. పదేండ్ల పాటు బోధన్ నియోజకవర్గ ప్రజలు తనకు ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చారని, ఇందుకు నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. కాంగ్రెస్‌ది నిజమైన గెలుపు కాదని, తక్కువ ఓట్ల తేడాతోనే ఓడిపోయామన్నారు.

**మూడు నెలల తర్వాత కేసీఆరే సీఎం..**

'పదవుల కోసం కాంగ్రెసోళ్లు ఐదు గ్రూపులుగా విడిపోయి కొట్టుకుంటున్నారు. కాంగ్రెస్ క్యాంప్ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలు పారిపోతున్నారు.. వాళ్లలో వాళ్లే కొట్టుకోవడంతో రెండు నెలల్లో ఈ కాంగ్రెస్ ప్రభుత్వం కుప్పకూలిపోతుంది. గ్యారంటీగా చెబుతున్నా.. రెండు, మూడు నెలల్లో మళ్లీ ఎన్నికలు వచ్చినా ఆశ్చర్యపడాల్సిన పనిలేదు.. మూడు నెలల తర్వాత కేసీఆరే ఈ రాష్ట్రానికి సీఎం అవుతారు..' అంటూ షకీల్ వ్యాఖ్యానించారు. కాంగ్రెసోళ్లకు పదవులే ప్రధానమని, ప్రజల సమస్యలు వారికి పట్టవని విమర్శించారు. తెలంగాణకు శ్రీరామరక్షగా నిలిచిన కేసీఆర్ త్వరలోనే మళ్లీ సీఎంగా వస్తారని చెప్పారు.

**గెలిచిన అహంతో దౌర్జన్యం..**

గెలిచిన మర్నాడు బోధన్‌లో బీఆర్‌ఎస్ కార్యకర్తలు, మైనార్టీ యువకులపై కొంతమంది కాంగ్రెసోళ్లు దౌర్జన్యం చేశారని, ఇది పిరికిపంద చర్యని షకీల్ ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంపై దాడిచేసి తన విలువైన వస్తువులను,. పత్రాలను దొంగతనం చేశారని, దీన్ని నివారించిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు, మైనార్టీ యువకులపై దాడిచేశారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా దాడిలో గాయపడిన మైనార్టీ యువకుడి చేతికి, కాలికి అయిన గాయాలను షకీల్ సభా వేదికపైన చూశారు. ఇటువంటి చిల్లర పనులు కుక్కలు మాత్రమే చేస్తాయని, కాంగ్రెసోళ్లు రౌడీలు, గుండాల్లాగా వ్యవహరించారని విమర్శించారు. ఇటువంటి పనులు మానుకోకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఎమ్మెల్యేగా గెలిచిన సుదర్శన్‌రెడ్డి ఇటువంటి గూండాలు, బ్రోకర్లను ప్రోత్సహించరాదని, వీరిని దూరంగా పెట్టి తన కున్న పేరును కాపాడుకోవాలని హితవుచెప్పారు.

**కంటనీరు పెట్టిన బోధన్ ఏఎంసీ చైర్మన్**

సమావేశంలో బోధన్ ఏఎంసీ చైర్మన్ వెంకటేశ్వరావు దేశాయ్ మాట్లాడుతూ ఒక్కసారిగా ఉద్వేగానికి గురయ్యారు. కంటనీరు పెడుతూ రోదించారు. షకీల్ ఎంతో మంచి మనిషి.. మచ్చలేని నాయరేడు.. పదేండ్లుగా బోధన్ నియోజకవర్గం అభివృద్ధికి, సంక్షేమానికి ఎంతో కృషిచేశారు. ఇటువంటి ప్రజల మనిషి షకీల్ ఓడిపోవడం దురదృష్టకరం..' అంటూ ఆయన కన్నీరు పెట్టుకున్నారు. షకీల్ ఆయనను ఓదార్చారు. ఈ సందర్భంగా షకీల్ కూడా భావోద్వేగానికి గురయ్యారు. సమావేశంలో నాయకులు గిర్దావర్ గంగారెడ్డి, బుద్దె రాజేశ్వర్, జడ్పీ వైస్ చైర్‌పర్సన్ రజితా యాదవ్, బీఆర్‌ఎస్ బోధన్ పట్టణం, వివిధ మండలాల అధ్యక్షులు రవీందర్ యాదవ్, గోగినేని నరేంద్రబాబు (నర్సయ్య), సంజీవ్‌కుమార్, డి.శ్రీరామ్, నర్సింగ్ రావు, భూంరెడ్డి, నాయకులు ఆబిద్ అలీ, సంగం వెంకట్‌రెడ్డి, తెలంగాణ శంకర్, సిర్ప సుదర్శన్, పి.గంగాధర్‌గౌడ్, ఆబిద్, బెంజర్ గంగారాం, శంకర్‌గౌడ్, అబ్దుల్ రహ్మాన్, కార్యకర్తలు పాల్గొన్నారు.





నిజామాబాద్ రూరల్, ఆర్మూర్ తాజా మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, ఆశన్నగారి జీవన్‌రెడ్డి, ధర్పల్లి జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ మంగళవారం ఎర్రవెల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేసీఆర్ వారి నుంచి పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికలు ముగిసిన తర్వాత మొదటి సారిగా కేసీఆర్‌ను కలిశారు.
–నిజామాబాద్ రూరల్/ నందిపేట్, డిసెంబర్ 5

## ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డికి
# శుభాకాంక్షల వెల్లువ



ఎమ్మెల్యే పోచారానికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

బాన్సువాడ/బాన్సువాడ రూరల్, డిసెంబర్ 5 : అసెంబ్లీ ఎన్నికల్లో బాన్సువాడ నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ తరపున పోటీ చేసి భారీ మెజారిటీతో ఎమ్మెల్యేగా గెలిచిన పోచారం శ్రీనివాసరెడ్డిని బాన్సువాడ మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పోచారానికి స్వీట్లు తినిపించి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన పోచారం గెలవడం సంతోషంగా ఉందని నాయకులు పేర్కొన్నారు. డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, పోచారం సురేందర్ రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



నియోజకవర్గ నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

# కన్నుల పండువగా..

- కాలభైరవుడి జన్మదిన వేడుకలు
- కొనసాగుతున్న ప్రత్యేక పూజలు
- భారీగా తరలివస్తున్న భక్తులు



పుష్కరి నుంచి గంగాజలాన్ని తీసుకొస్తున్న భక్తులు



స్వామి వారి బంగారు విగ్రహం



వడల హారాలతో స్వామి వారికి అలంకరణ

రామారెడ్డి డిసెంబర్ 5 : రామారెడ్డి మండలం ఇసన్నపల్లి (రామారెడ్డి) గ్రామాల్లో వెలసిన శ్రీ కాలభైరవస్వామి జన్మదిన వేడుకల్లో భాగంగా నాల్గో రోజైన మంగళవారం స్వామి వారి పుట్టిన రోజు (అష్టమి తిథి) సందర్భంగా సంతతధారాభిషేకం నిర్వహించారు. ఆలయ ఆవరణలో ఉన్న కోనేరు నుంచి గంగాజలం తెచ్చి స్వామి వారికి పూజలు చేశారు. ధ్వజారోహణం, మహాపూజలు కొనసాగాయి. అనంతరం భక్తులు సమర్పించిన విరాళాలతో ఏర్పాటు చేసిన స్వామి వారి బంగారు విగ్రహాన్ని కార్యాలయం నుంచి భాజాభజంత్రీలతో ఎదుర్కొని వెండి తొట్లెలో ఉంచి ఊయల సేవ నిర్వహించారు. అనంతరం ఆలయం చుట్టూ ఎండ్లబండ్లు (పప్పు ఫలహారబండ్లు) ప్రదర్శన నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామి వారికి సిందూర పూజలు చేసి స్వామి వారికి ఇష్టమైన వడల హారంతో అలంకరించారు. కామారెడ్డి అసిస్టెంట్ కలెక్టర్ చంద్రమోహన్ దంపతులు స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో ప్రభురాంచంద్రం,సీనియర్ అసిస్టెంట్ సురేందర్, శైవులు జంగం ప్రభాకర్‌స్వామి, కోటయ్యా, భక్తులు పాల్గొన్నారు.